వనమహోత్సవానికి సన్నద్ధం

- గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలలో మొక్కల పెంపు
- ఇప్పటికే మొక్కలు నాటే ప్రాంతాల గుర్తింపు


మందిపల్లిలోని నర్సరీలో సిద్ధం చేసిన మొక్కలు

ధన్వాడ: రాష్ట్రంలో పచ్చదనం వెల్లివిరియాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం చేపట్టిన వనహోత్సవానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే గ్రామాల వారిగా ఏర్పాటు చేసిన నర్సరీలలో మొక్కల పెంపకం చేపట్టారు. గత సంవత్సరం పెంచిన మొక్కలు కూడా అందుబాటులో ఉండటంతో ఈసారి అధిక సంఖ్యలోనే మొక్కలు నాటేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు త్వరగానే రావడంతో ముందస్తుగా కురుస్తున్న వర్షాలతో త్వరలో వనమహోత్సవం కార్యక్రమాన్ని పెద్దఎత్తున చేపట్టి విజయవంతం చేసేందుకు కసరత్తులు చేస్తున్నారు. వనమహోత్సవం కార్యక్రమాన్ని ఎలా విజయవంతం చేయాలనే దిశగా అధికారులు.. కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో ఇప్పటికే సమాలోచనలు చేశారు.

తూతూమంత్రంగా మొక్కల రక్షణ

గతంలో నాటిన మొక్కలు చాలా వరకు ఎండిపోయి విరిగిపోయాయి. అధికారులు మొక్కలు నాటి వాటి సంరక్షణ తూతూమంత్రంగా చేపట్టడంతో అనేక మొక్కలు చనిపోయాయి. నాటిన మొక్కలు పెరిగేలా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో వనమహోత్సవం ఉద్దేశం నెరవేరడం లేదు. రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటగా రోడ్డు పక్కనే పొలం ఉన్న రైతులు పంట వ్యర్థాలకు మంటలు పెట్టడంతో మొక్కలు కూడా కాలిపోతున్నాయి. ఈ క్రమంలో ఈసారి నాటిన ప్రతి మొక్క బతికేలా చర్యలు తీసుకోవాలని ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు.

15 రకాల మొక్కల పెంపకం

మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీకి ఒక వన నర్సరీని ఏర్పాటు చేసి ఉపాధీహామీ పథకంలో భాగంగా మొక్కలు పెంచుతున్నారు. మండలంలో 20 గ్రామ పంచాయతీలు ఉండగా మొత్తం 20 నర్సరీలు ఏర్పాటు చేసి దాదాపు నాలుగు నుంచి 5 రకాల మొక్కల పెంపకం చేపట్టారు. వన మహోత్సవంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 62 వేల మొక్కలను నాటాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మేరకు నర్సరీలలో పండ్లు, పూలు, ఉసిరి, నిమ్మ, మునగ, కరివేపాకు, కానుగ, సిల్వోమాం, చింత, వేప, చీమచింత, కాగితపు రకాలు నీడనిచ్చే మొక్కలు పెంచుతున్నారు. మరీ ఈ సారైనా ప్రభుత్వం వనమహోత్సవాన్ని పకడ్బందీగా చేపట్టి పచ్చదనం పెరిగేలా చూడాలి.

ఆదేశాలు రాగానే ప్రారంభిస్తాం



మండలంలోని అన్ని గ్రామాలలో మొక్కలను నాటుతున్నాం. ఈ సారి 62వేల మొక్కలు నాటాల్సి ఉంది. ప్రతి గ్రామంలో వెయ్యి నుంచి 5 వేల మొక్కలను నాటనున్నాం.వన మహోత్సవాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి. అధికారుల ఆదేశాలు రాగానే వనమహోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభిస్తాం.

– సిద్దేశ్వర్, ఎపీఓ, ధన్వాడ

క్లుప్తంగా

కళాశాల ఏర్పాటుకు యువత కలిసిరావాలి

మరికల్: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు కోసం యువత కలిసిరావాలని బీజేపీ మండల అధ్యక్షుడు వేణుగోపాల్, నాయకులు రమేష్, శ్రీరామ్‌లు శుక్రవారం సంయుక్త ప్రకటనలో కోరారు. దశాబ్దాల నుంచి మరికల్‌లో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ఎన్నో ఆందోళన కార్యక్రమాలు చేపట్టినా ఇక్కడి ప్రజాప్రతినిధుల నుంచి స్పందన లేదన్నారు. ఇక్కడి రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకోవడం, వారి అక్రమ ఆస్తులపై ఉన్న శ్రద్ధ పేద విద్యార్థుల చదువుపై లేదని విమర్శించారు. యువత కలిసివచ్చి ఇక్కడి పాలకులను, అధికారులను నిలదీసి గ్రామంలో తిరగకుండా చేస్తే కళాశాల సాధ్యమవుతుందన్నారు. ఇందుకు యువత ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు.

యోగా డేను విజయవంతం చేద్దాం

ఊట్కూరు: ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా స్థానిక ఊర లక్ష్మమ్మ దేవాలయం దగ్గర శనివారం ఉదయం 6 గంటలకు యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ సభ్యులు శంకర్, రమేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో యువకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విద్యుత్ స్తంభాలు సరి చేయండి



మాగనూర్: మాగనూర్ మండల పరిధిలోని గురువలింగంపల్లి గ్రామ శివారులో గత నెలలో వీచిన ఈదుగాలులకు పలు విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. స్తంభాలు కూలిపోయి దాదాపు నెల రోజులు కావొస్తున్నా విద్యుత్ అధికారులు మరమ్మతు చేయడం లేదని రైతులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కూలిపోయిన విద్యుత్ స్తంభాలకు మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

ప్రమాదకరంగా నీటి గుంత



మరికల్: మండలంలోని పెద్దచింతకుంటలో ఓ నీటి కొళాయి గుంత ప్రమాదకరంగా మారింది. పబ్లిక్ కొళాయి వద్ద నీటిని పట్టుకోవడానికి గుంతను ఏర్పాటు చేశారు. అయితే గుంత చుట్టూ ఎలాంటి రక్షణ లేకపోవడంతో చిన్నపిల్లలు ఆడుకుంటూ గుంతలో పడే అవకాశం ఉంది. ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి గుంత చుట్టూ రక్షణ గోడను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

దండోరా గ్రామ కమిటీ ఎన్నిక

కొల్లాపూర్ రూరల్: మండలోని ఎర్రగట్టు బొల్లారం గ్రామంలో దండోరా మండల ఇన్‌చార్జులు అగ్రస్వామి, ఎదుల రాముడు ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దాసరి నరేష్, అధికార ప్రతినిధిగా దాసరి వెంకటస్వామి, ఎల్లపోగు వెంకటేశ్వర్లు, మల్లెల వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శిగా కదిరే నిరంజన్, కార్యదర్శిగా మహేష్‌తో పాటు ఇతర సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో దండోరా, గ్రామ, మండల నాయకులు పాల్గోన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల యోగాసనాలు



నారాయణపేట రూరల్: అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను మండలంలోని జాజాపూర్ జడ్పీ స్కూల్, బోయిన్‌పల్లి యూపీఎస్ పాఠశాలల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు యోగా ఆంగ్ల అక్షరాల రూపంలో కూర్చొని ప్రత్యేకతను చాటారు. ఉపాధ్యాయులు, చిన్నారులు, మహిళలు యోగా చేశారు. డీఎస్‌ఓ భానుప్రకాష్ మాట్లాడుతూ శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతకు యోగా ఎంతో దోహదపడుతుందన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


మరికల్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

మరికల్: ఇళ్లులేని పేదలకు సొంతింటి కలను నిజం చేసేందుకే తమ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే పర్ణికారెడ్డి అన్నారు. మరికల్‌లో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుంటే ప్రతిపక్ష పార్టీల నాయకులు ఓర్వలేక అసత్యాలను ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునే వారందరికీ ఇసుక ఉచితంగా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సూర్యమోహన్ రెడ్డి, హరీష్, రామకృష్ణ, రఘుపత్తిరెడ్డి, రాజు, గోపాల్, కృష్ణయ్య, రామకృష్ణారెడ్డి, రఘు, కుర్మన్న, ఆంజనేయులు, ఖాజ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

మాగనూర్: మండలంలోని అమ్మపల్లి గ్రామంలోని పలువురు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా ఎంపీడీవో రహ్మతుద్దీన్ శుక్రవారం మార్కింగ్ వేసి నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరితగతిన ఇళ్లు నిర్మించుకుంటే ప్రభుత్వం విడతల వారిగి నగదు అందజేస్తుందన్నారు. అదే విధంగా స్థానిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం మహిళా సమైక్య ఆధ్వర్యంలో ఉల్లాస కార్యక్రమంపై సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, హౌసింగ్ ఏఈ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలి


వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

నారాయణపేట రూరల్: రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక స్థలాలను సందర్శించేందుకు ఆర్టీసీ ప్రత్యేక ప్యాకేజీతో నడవనున్న బస్సులను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఆర్టీసీ మార్కెటింగ్ సభ్యులతో కలిసి ప్రత్యేక ప్యాకేజీ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. యానగుంది మొదలుకొని అరుణాచలం వరకు ప్రత్యేక రాయితీతో బస్సు సర్వీసులు ప్రారంభించినట్లు తెలిపారు. విహార యాత్రలకు కుటుంబ సమేతంగా వెళ్లాలనుకునేవారు అలాగే విద్యార్థులు ఈ బస్సు సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, ఆర్టీసి మార్కెట్ కమిటీ సభ్యులు హన్మంతు, ఎల్.సురేష్ కుమార్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు యూనిఫాంల పంపిణీ


అంగన్‌వాడీ చిన్నారులకు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలుకుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ

అమరచింత: అంగన్‌వాడీల్లో చదువుకుంటున్న చిన్నారులకు ఉచితంగా యూనిఫాంలను ప్రభుత్వం అందిస్తుందని ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మమ్మ తెలిపారు. మండల కేంద్రంలోని 5వ అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం సందర్శించి విద్యార్థుల పురోగతితో పాటు రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు ఆటపాటలతో ప్రాథమిక విద్య అందిస్తున్నామన్నారు. అంగన్‌వాడీలో చేరిన విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు. గర్భిణులు, ప్రసూతి, కిశోర బాలికల కోసం ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నర్మద, టీచర్ రాధిక పాల్గొన్నారు.

ప్రైవేటుకు దీటుగా విద్యా బోధన


ప్రభుత్వ పాఠశాలలో చేరిన చిన్నారులతో దత్తురావు

నారాయణపేట రూరల్: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని కాంప్లెక్ హెడ్ మాస్టర్ దత్తురావు అన్నారు. మండలంలోని జాజాపూర్ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలను మెరుగుపరుస్తున్న విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి సర్కారు బడులను బలోపేతం చేయాలన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో అడ్మిషన్ల సంఖ్యను పెంచాలన్నారు. పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్స్ తొలిరోజే అందించామని, నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ భాను ప్రకాష్, హెడ్మాస్టర్లు భారతి, పద్మజ, ఉపాధ్యాయులు బాలకృష్ణ, గీత, రజిత, అంగన్వాడి టీచర్ ఆశమ్మ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ తరగతులు


పాఠశాలలో డిజిటల్ తరగతులను ప్రారంభించిన గ్రామ పెద్దలు

ఊట్కూరు: మండలంలోని ఎంపీపీఎస్ ఉర్దూ మీడియం పాఠశాలలో శుక్రవారం దాతల సహకారంతో డిజిటల్ తరగతుల ద్వారా విద్యా బోధన చేపట్టారు. ప్రధానోపాధ్యాయులు సలాం మాట్లాడుతూ.. అజీర్‌శాహనగారి ఆర్థిక సహకారంతో పాఠశాలలో డిజిటల్ బోధన ప్రారంభించినట్లు తెలిపారు. డిజిటల్ తరగతుల ద్వారా బోధించడం వలన విద్యార్థులు పాఠ్యాంశాలు సులభంగా నేర్చుకోవడంతో పాటు చదువుకోవడానికి ఉత్సాహం చూపుతారన్నారు. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో మహమ్మద్ ఖాజాపాషా, మంన్సూర్‌అలీ, వికార్ యూనోస్, జమీర్‌అలీ పాల్గొన్నారు.

అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కొండయ్య

కృష్ణా: రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండయ్య సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన ఉమ్మడి మాగనూర్, కృష్ణా మండలాల బీజేపీ కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధానంగా గ్రామాల్లో మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఇంటింటికి తీసుకెళ్లి పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు బాస్కర్, ఉమ్మడి మండల అధ్యక్షుడు నర్సప్ప, జిల్లా ఉపాధ్యక్షుడు సోమశేఖర్‌గౌడ్, మాజీ ఎంపీపీ శ్యామలమ్మ, కర్నె స్వామి,జయానందరెడ్డి,అశోక్‌గౌడ్, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదాం

కొత్తపల్లి: త్వరలోనే జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రతాప్‌రెడ్డి కార్యకర్తలకు సూచించారు. శుక్రవారం మండలంలోని నిడ్జింత గ్రామంలో బీజేపీ అధ్వర్యంలో 'వికసిత్ భారత్' కార్యక్రమంలో భాగంగా కొత్తపల్లి, గుండుమాల్ మండలాల కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రజల పక్షాన పోరాటం చేయడంతో పాటు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మదన్, పార్టీ అధ్యక్షుడు కేశవరెడ్డి, పార్టీ నాయకులు రవిగౌడ్, శ్రీనవాసులు, మల్‌రెడ్డి, రమేష్, సుధాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవాలు


ధ్వజపతాక ఆవిష్కరణతో ఉత్సవాలను ప్రారంభిస్తున్న మండలి సభ్యులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానం శ్రీకంచికామకోటి పీఠం పాలమూరుశాఖ 33వ వార్షికోత్సవాలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఉత్సవ సంకల్పం, గణపతిపూజ, గోపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. ఉత్సవాల ప్రారంభ సూచకంగా ధ్వజపతాక ఆవిష్కరణ చేశారు. ఉత్సవాలు ఈనెల 29వ తేదీవరకు జరుగుతాయని శ్రీవెంకటేశ్వర సేవా మండలి అధ్యక్షుడు తోటపల్లి శ్రీకాంత్‌శర్మ, ప్రధాన కార్యదర్శి గొండ్యాల రాఘవేంద్రశర్మ తెలిపారు. వార్షిక ఉత్సవాల్లో శివాలయంలో సుప్రభాత సేవ, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, వేంకటేశ్వరస్వామి ఆలయంలో సుప్రభాత సేవ, యాగశాలలో అవాహిత దేవతాపూజలు, లక్ష్మీగణపతి, గరుడ, సుబ్రహ్మణ్య, నవగ్రహ, మూలమంత్ర అనుష్టానాదులు, చండీపారాయణ, శ్రీసూక్త, పురుషసూక్త, సుందరకాండ పారాయణం, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, విశేష కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఆదివారం గజ వాహన సేవ, 22న హనుమత్ వాహనం, 23న గరుడ వాహనం, 24న శేషవాహనం, 25న మయూర వాహనం, 26న హంస వాహనం, 27న సింహవాహనం సేవ, 28న సుదర్శన హోమం, శాంతి కళ్యాణం, 29న రథోత్సవం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో రాజేశ్వర్, సుదర్శన్‌గౌడ్, వేణుగోపాల్, నాగరాజు, సత్యనారాయణ, శ్రీచంద్రశేఖర వేద పాఠశాల గురువులు పాల్గొన్నారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు



దేవరకద్ర: మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం 7గంటలకు మహిళలు సామూహిక కుంకుమార్చన, లలితా సహస్రనామ పారాయణం చేశారు. అనంతరం పల్లకీసేవ నిర్వహించి మహా మంగళహారతి ఇచ్చారు. పూజల అనంతరం భక్తులకు ప్రసాదం వితరణ చేశారు.

శాంతిభద్రతలను కాపాడండి

ఊట్కూరు: ఊట్కూరు ఎస్ఐ ఇటీవల బాధ్యతలు చేపట్టిన రమేష్‌ను శుక్రవారం బీజేపీ మండల అధ్యక్షుడు చంద్రశేకర్‌గౌడ్ సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో నేరాలు జరగకుండా చూసి శాంతిభద్రతల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు రఘువీర్, నాయకులు ఆశప్ప, రమేష్, భాస్కర్, హనుమంతు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలి

కొత్తపల్లి: ముదిరాజ్‌లను బీసీ–ఏ జాబితాలో చేర్చాలని ముదిరాజ్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని గొకుల్‌నగర్ గ్రామంలో ముదిరాజ్‌లతో సమావేశం నిర్వహించారు. ముదిరాజ్‌లు ఎవరైనా ఎన్నికల్లో నిలబడితే వారిని గెలిపించడానికి కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం ముదిరాజ్‌లకు 50 ఏళ్లకే పింఛన్, చేపల చెరువులపై సంఘాలకు పూర్తి హక్కులు కల్పించాలని, అలాగే రూ.20 లక్షల సహజ బీమా కోసం నియోజకవర్గ స్థాయిలో త్వరలోనే భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సాయిలు, శివశంకర్, కూర వెంకటయ్య, జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

షీ టీంపై విద్యార్థినులకు అవగాహన



మద్దూరు: పట్టణంలో బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు శుక్రవారం షీ టీంపై పోలీసులు అవగాహన కల్పించారు. ఆడ పిల్లలను, మహిళలను ఎవరైనా వేధిస్తే షీం టీంను సంప్రదించాలని సూచించారు. అలాగే పోక్సో చట్టం, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, సైబర్ నేరాలు, డ్రగ్స్ ప్రభావం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర విషయాలపై బాలికలకు అవగాహన కల్పించారు. లైంగిక వేధింపులకు గురి చేస్తే 87126 70398 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో షీటీం పోలీసులు బాలరాజు, చెన్నయ్య, జ్యోతి, కవిత, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు ట్యాంకు వితరణ



మక్తల్: పట్టణంలోని మారుతి నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వాటర్ ట్యాంకు, పెన్నులు, స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. బ్యాంకు యూనియన్ నాయకులు ప్రభమరాంబికలతో పాటు సిబ్బంది చేతుల మీదుగా వీటిని అందజేశారు. బ్యాంకు సిబ్బంది సామాజిక సేవలో భాగంగా విద్యార్థులకు తాగునీటి వసతి కోసం ట్యాంకును వితరణ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నర్సింములు, రవికుమార్, దిలీప్, నవీన్, శ్రీబింధు, మధుసూదన్, జగదీశ్, కానుకుర్తి, మరికల్ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పత్రి వ్యర్థాల తరలింపులో నిర్లక్ష్యం వద్దు


సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ శ్రీనివాసులు

అమరచింత: జిల్లాలోని ఆస్పత్రుల్లోని వ్యర్థాలను తరలించడంలో స్వేతాంస్ నిర్వాహకులు అశ్రద్ధ చూపడంతో షోకాజ్ నోటీసులను ఇచ్చామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. డ్రైడే, ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా మండలంలోని పీహెచ్‌సీని ఆయన సందర్శించారు. ఈమేరకు ఆస్పత్రిలోని వ్యర్థాల తరలింపుపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రెండు రోజులకు ఒక పర్యాయం వస్తున్నారని, దీంతో మున్సిపాలిటీ చెత్తబండిలో వీటిని వేసే పరిస్థితి దాపరించిందని తెలపడంతో వ్యర్థాలను సేకరించే నిర్వాహకులతో ఫోన్‌లో మాట్లాడారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆస్పత్రిలోని వ్యర్థాలను 24 గంటల లోపు అక్కడి నుంచి తరలించాలని ఆదేశించారు. అదే విధంగా డీఎంఆర్‌ఎం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రభుత్వపరంగా పీహెచ్‌సీ కోసం అనుమతులు వచ్చాయని, వీటి నిర్వహణ కోసం కావాల్సిన సిబ్బంది కోసం మంత్రి వాకిటి శ్రీహరికి తెలియపర్చామన్నారు.

అబార్షన్ వ్యవహారంపై విచారణ

పట్టణానికి చెందిన ఓ మహిళ తన గర్భంలో ఆడ శిశువు ఉందనే సమాచారంతో అబార్షన్ చేసుకుందనే ఫిర్యాదుతో సదరు కుటుంబ సభ్యులను విచారించామని డీఎంహెచ్‌ఓ తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని, అలాంటిది పక్క రాష్ట్రంలోని కర్నూలు జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో లింగ నిర్ధారణ చేసుకుని ఆడపిల్ల అని తెలియగానే అబార్షన్ చేసుకున్న ఘటనలో ఎలాంటి నిజం లేదని డీఎంహెచ్‌ఓ తెలిపారు. ఈమేరకు బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన వాంగ్మూలం సేకరించామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఫయాజ్, డాక్టర్ రూపశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి


మంత్రికి వినతిపత్రం అందిస్తున్న యువజన సంఘాల నాయకులు

అమరచింత: మండల కేంద్రానికి శుక్రవారం వచ్చిన మంత్రి వాకిటి శ్రీహరికి పలు సంఘాల నాయకులు సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రాలు అందించారు. డీవైఎఫ్ఐ, ఏఐవైఎఫ్, పీడీఎస్‌యూ సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని, అమరచింతకు జిల్లా కేంద్రం నుంచి షటిల్ సర్వీస్‌లను కొనసాగించాలని, మండలంలోని పాంరెడ్డిపల్లి శివారులో ఉన్న కేజీబీవీకి రహదారి ఏర్పాటు చేయాలంటూ మంత్రికి విన్నవించారు. అలాగే చంద్రనాయక్‌తండా శివారులో భూత్పూరు రిజర్వాయర్ నీటితో ఆయకట్టు రైతులకు సాగునీటిని అందించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు రాఘవేంద్ర, చంటి, కుతుబ్, వెంకటేష్, జీఎస్ గోపి పాల్గొన్నారు.

30 నిమిషాల వ్యవధిలో రెండు ప్రమాదాలు

- ఒకరు మృతి, ఐదుగురికి గాయాలు


ప్రమాదంలో మరణించిన వరలక్ష్మి

మాగనూర్: మండల కేంద్రం సమీపంలో 30 నిమిషాల వ్యవధిలో రెండు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్న ఘటనలో ఒకరు మృతి చెందగా, ఐదుగురు గాయపడిన ఘటన శుక్రవారం జరిగింది. ఎస్ఐ అశోక్‌బాబు తెలిపిన వివరాలు.. మండల కేంద్రంలోని అభిషేక్ దాబా సమీపంలో ఊట్కూర్ వైపు నుంచి రాయచూర్ వైపునకు వెళ్తున్న కారు, కర్ణాటక నుంచి ఆక్సిజన్ సిలిండర్లతో వస్తున్న అశోక్ లేలాండ్ వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో కారులో ఉన్న వరలక్ష్మి (60) అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందగా, విష్ణు, వినోద్‌కుమార్, రాజేష్‌గౌడ్ గాయపడ్డారు. మృతురాలు వరలక్ష్మి (60) ఊట్కూర్ తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ పనులు ముగించుకొని తిరుగు ప్రయాణంలో రాయచూర్‌కు వెళ్తున్న క్రమంలో ప్రమాదం చోటు చేసుకున్నట్లు బాధితులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం వరలక్ష్మి మృతదేహాన్ని మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించే క్రమంలో అంబులెన్స్ 40 నిమిషాలు అయిన అందుబాటులోకి రాలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

బైక్‌ను ఢీకొట్టిన టిప్పర్

తహసీల్దార్ కార్యాలయ సమీపంలో కృష్ణ మండలం మురహర్‌దొడ్డికి చెందిన ముర్కుంద కుటుంబ సభ్యులతో కలిసి ద్విచక్రవాహనంపై మాగనూర్ వైపు నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా కర్ణాటక రాష్ట్రం శక్తినగర్ నుంచి బూడిద లోడ్‌తో వస్తున్న టిప్పర్ ఢీకొట్టింది. ప్రమాదంలో ముర్కుంద, నర్మద, అక్షయ్‌లు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రెండు ప్రమాదాలపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ అశోక్‌బాబు తెలిపారు.